# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్ 20.09.2025 | 24 క్యారెట్లు 9,88.300 | కిలో వెండి 1,20,000 | 30 °C | సంపుటి:3 | సంచిక:264

www.vishalabharati.com


## ఎకరం.. రూ.140 కోట్లపైనే!



**హైదరాబాద్:** భూముల వేలంతో భారీగా నిధులు సమీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కనిష్టంగా రూ.2 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం.. ఈ మేరకు హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన రాయదుర్గంలో భూములను వేలం వేయనుంది. నాలెడ్జ్ సిటీలోని 18.67 ఎకరాలను ఈ-వేలానికి తెలంగాణ ఇండ్రస్టియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (టీజీఐఐసీ) అన్ని ఏర్పాట్లు చేసింది. ఒక ఎకరానికి ప్రారంభ ధర రూ.101 కోట్లుగా నిర్ణయించింది. అయితే పలు నిర్మాణ సంస్థలు ఎకరాకు రూ.140 కోట్లకు పైగానే వెచ్చించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో కోకాపేట నియోపోలిస్ ఫేజ్-2లో హెచ్ఎండీఏ నిర్వహించిన వేలంలో రికార్డ్ స్థాయిలో ఎకరం రూ.100 కోట్లు పలికిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అంతకు మించి ధర పలకడం ఖాయమని రియల్టీ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# వచ్చే నెల మోదీ-ట్రంప్ భేటీ



- భారత్-అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతలు
- ట్రంప్, మోదీ మధ్య కొంత గ్యాప్
- ముదిరిన రష్యా చమురు వివాదం
- అధిక సుంకాలతో విరుచుకుపడింది
- రెండు దేశాల మధ్య వాణిజ్య చర్చలు
- ఆసియాన్ సమ్మిట్‌కి మోదీ, ట్రంప్
- భారత్ వేదికగా క్వాడ్ సమ్మిట్

*భారత్-అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతలు.. రష్యా ఉక్రెయిన్ యుద్ధం జరుగుతున్న తరుణంలో తక్కువ ధరకు రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులు చేసుకోవడం.. వంటి కారణాలతో గత కొన్ని రోజులుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మధ్య కొంత గ్యాప్ ఏర్పడినట్లు.. జరుగుతున్న పరిణామాలను బట్టి చూస్తుంటే స్పష్టంగా అర్థం అవుతోంది.*

**విశాలభారతి, నేషనల్:** భారత్‌పై అమెరికా అధిక సుంకాలతో విరుచుకుపడిన తర్వాత.. రెండు దేశాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నప్పటికీ.. అవి ఓ కొలిక్కి రాకపోవడంతో.. ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలోనే ఈ నెలాఖరులో అమెరికాలో జరగనున్న 80వ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో

మిగతా 2లో



# అభివృద్ధిలో భాగస్వాములు కండి

- ఢిల్లీలో పబ్లిక్ ఎఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా
- తెలంగాణలో పెట్టుబడులకు ఆహ్వానం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు
- పెట్టుబడులకు భద్రత ఉంటుంది
- రాష్ట్ర అంబాసిడర్లుగా మారాలి
- దేశంలో యంగెస్ట్ స్టేట్ తెలంగాణ
- హైదరాబాద్‌కు ఘనమైన చరిత్ర

2

*తెలంగాణలో పెట్టుబడులకు ఆహ్వానం పలుకుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు మద్దతుగా నిలుస్తామని.. తెలంగాణలో పెట్టే పెట్టుబడులకు భద్రత ఉంటుందని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం చేపడుతున్నామని వ్యాఖ్యానించారు. పరిపాలన చేసేందుకు రాజకీయ సంకల్పం ఎంతో అవసరమని చెప్పుకొచ్చారు.*

## ఆర్టీసీ స్పెషల్ బాదుడు

- రాష్ట్రంలో ఘనంగా బతుకమ్మ
- ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం
- ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- హరీశ్ రావు స్పందించారు
- ఆర్టీసీ తీరుపై ఆగ్రహం వ్యక్తం
- రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు
- 50 శాతం టికెట్ ఛార్జీల పెంపు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణలో ప్రధాన పండుగ బతుకమ్మ, దసరాల సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తోంది. అయితే వీటికి అదనంగా ఛార్జీలు వసూలు చేస్తుండడంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తెలంగాణ ఆర్టీసీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర వివాదం రేపుతున్న ఈ అంశంపై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. దసరా ప్రత్యేక బస్సుల్లో 50 శాతం ఆర్టీసీ టికెట్ ఛార్జీల పెంపుపై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పండుగలు వస్తే చాలు ఆర్టీసీ బస్సు ఛార్జీలు అడ్డగోలుగా పెంచి

మిగతా 2లో



# రాహుల్‌కు సిగ్గు లేదు

- ఓట్ చోరీపై కేటీఆర్ విమర్శలు
- ఎమ్మెల్యేల చోరి పెద్ద నేరం
- రాహుల్‌కు రెండు నాల్కలు
- గొంతు చించుకుంటున్నాడు
- ఎమ్మెల్యేల చోరీపై సమాధానం
- ప్రజాస్వామ్యం పట్టపగలు ఖూనీ
- బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లోకి

*ఓట్ చోరి కంటే ఎమ్మెల్యేల చోరి పెద్ద నేరం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల చోరిపై మాట్లాడకపోవడం రాహుల్ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని.. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయిస్తేనే ఓట్ చోరిపై మాట్లాడే నైతిక అర్హత ఉంటుందన్నారు.*

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఓట్ చోరీపై గొంతు చించుకుంటున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, తెలంగాణలో తమ పార్టీ చేసిన ఎమ్మెల్యేల చోరీపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఓట్ల చోరీ ఒక నేరమైతే, ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలను దొంగిలించడం అంతకంటే పెద్ద నేరమని, అది

మిగతా 2లో

# కడియం కహానీ..!

- కడియం శ్రీహరి సంచలన కామెంట్స్
- ఎహన్మకొండలో మీడియా సమావేశం
- అధికార పార్టీతో కలిసి పనిచేస్తున్నా
- నియోజకవర్గాన్ని అభివృద్ధి కోసం
- రాజకీయాలను భ్రష్టు పట్టించారు
- ప్రజాస్వామ్యం పట్టపగలు ఖూనీ
- ఆనాడు కేసీఆర్ పార్టీ ఫిరాయింపులు

*తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో ఒకరైన స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంచలన కామెంట్స్ చేశారు. హన్మకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కడియం మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో 36 మంది శాసన సభ్యులను పార్టీలో చేర్చుకొని అందులో ఇద్దరికీ మంత్రి పదవి కూడా ఇచ్చారని కడియం శ్రీహరి గుర్తు చేశారు.*

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీతో కలిసి పనిచేయడం ద్వారా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని కాంగ్రెస్‌తో నడవడం జరుగుతుందని కడియం క్లారిటీ ఇచ్చారు. గత పదిహేను సంవత్సరాలుగా స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గానికి జరిగిన అన్యాయాన్ని



మిగతా 2లో



# కవితకు నో ఎంట్రీ

- ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్
- సంచలన వ్యాఖ్యలు చేశారు
- కిషన్ రెడ్డి సీబీఐని అపుతున్నారు
- కేటీఆర్ సలహాలు తీసుకుంటారు
- హైకోర్టు పరిధిలో ఫోన్ ట్యాపింగ్
- కవిత వ్యవహారం కుటుంబ సమస్య
- కేసీఆర్ కుటుంబాన్ని బహిష్కరించాలి

*కాళేశ్వరంపై సీబీఐ విచారణను ఆపుతోందని కిషన్ రెడ్డేనని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన అక్కడ మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.*

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సొంత అభిప్రాయాలు ఉండవని.. ఆయన కేటీఆర్ వద్ద నుంచి సలహాలు తీసుకుంటారన్నారు. కేటీఆర్ సలహాలతోనే కాళేశ్వరం పై సీబీఐ విచారణకు అడ్డం పడుతున్నారని వ్యాఖ్యానించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలలో బీఆర్ఎస్ పోటీచేయడమే దీనికి సాక్ష్యమన్నారు. గతంలో కాళేశ్వరం కేసు సీబీఐకి ఇస్తే 48 గంటల్లో విచారణ ప్రారంభిస్తామని కిషన్ రెడ్డి చెప్పారని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. కిషన్ రెడ్డి


మిగతా 2లో

# సంక్షోభంలో మావోయిస్ట్ పార్టీలు

- మావోయిస్టుల శిబిరం కకావికలం
- శిబిరమే చీలిపోయిందన్న వాదన
- కేంద్రం 2026 నాటికి నిర్మూలిస్తామంది
- నిర్మూలన చర్యలు తీవ్రతరం
- సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నాము
- కీలక నాయకుడు ప్రకటన
- ఈ ప్రకటనపై తీవ్ర అభ్యంతరం

2





# రాష్ట్రంలో ఫిరాయింపుల హీట్

- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్చ
- రాజకీయాలను కుదిపేస్తుంది
- కచ్చితంగా చర్యలు తీసుకోవాలి
- బీఆర్‌పార్టీ పట్టుబడుతుంది
- టెక్నికల్‌గా ఎమ్మెల్యేలు వ్యూహం
- 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు
- మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలి

*తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తున్న అంశం ఫిరాయింపు ఎమ్మెల్యేలు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాల్సిందేనని బీఆర్‌పార్టీ పట్టుబడుతుంది. అటు టెక్నికల్‌గా ఈ వ్యవహారం నుంచి బయటపడాలని ఎమ్మెల్యేలు వ్యూహరచన చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇప్పటికే ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారు.*

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** అయితే ఇద్దరు ఎమ్మెల్యేలు మినహా మిగిలిన 8 మంది వివరణ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేల వివరణను బీఆర్ఎస్ పార్టీకి చేరవేసిన స్పీకర్ ఆ పార్టీ వివరణ కోరింది. దీంతో బీఆర్ఎస్ సైతం వివరణతోపాటు పార్టీ మారిన ఆధారాలను సైతం అందజేసింది. దీంతో మళ్లీ బంతి స్పీకర్ కోర్టులోకి వచ్చింది. ఈ క్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మరోసారి ఆరుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారు.మరిన్ని ఆధారాలు సమర్పించాలంటూ

మిగతా 2లో

## వచ్చే నెల మోదీ-ట్రంప్ భేటీ

మొదటి పేజి తరువాయి

వాటికి ప్రధాని మోదీ హాజరు కావాల్సి ఉన్నా.. ఆయన వెళ్లే అవకాశాలు లేవని ఇప్పటికే స్పష్టమైంది. ఇలాంటి తరుణంలో తాజాగా ఓ వార్త ఇంటర్నేషనల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. వచ్చే నెల (అక్టోబర్)లో మలేషియాలో జరగనున్న ఆసియాన్ సమ్మిట్‌లో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భేటీ కానున్నారనే ఊహాగానాలు ఇప్పుడు ప్రపంచ దేశాలకు ఉత్కంఠను కలిగిస్తున్నాయి. ఇటీవల ప్రధాని మోదీ 75వ పుట్టినరోజు సందర్భంగా వీరిద్దరు నేతలు ఫోన్‌లో మాట్లాడుకున్న తర్వాత ఈ వార్త రావడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే దీనిపై రెండు దేశాల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడం గమనార్హం. మరోవైపు.. నవంబర్‌లో భారత్ వేదికగా క్వాడ్ సమ్మిట్ జరగనుంది. ఒకవేళ మలేషియాలో ట్రంప్, మోదీ కలిస్తే.. క్వాడ్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ట్రంప్ భారత్‌కు రావడానికి మార్గం సుగమం అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. 47వ ఆసియాన్ సమ్మిట్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరు కానున్నట్లు మలేషియా ప్రధానమంత్రి దతుక్ సెరీ అన్వర్ ఇబ్రహీం తాజాగా వెల్లడించారు. ఈ విషయాన్ని స్వయంగా ట్రంప్ ఫోన్ చేసి చెప్పినట్లు తెలిపారు. ఇక ఇదే ఆసియాన్ సమ్మిట్‌కు చైనా ప్రధానమంత్రి (చైనా ప్రీమియర్) లీ కియాంగ్ కూడా హాజరు కానుండటంతో.. ఇప్పుడు ప్రపంచ దృష్టి మొత్తం మలేషియాపై పడింది. మరోవైపు.. గతంలో కూడా ఆసియాన్ సమ్మిట్‌లలో ప్రధాని మోదీ క్రమం తప్పకుండా పాల్గొన్నారు. ఈ ఏడాది ఈ సదస్సు కోసం మోదీ మలేషియా వెళ్లే అవకాశాలు ఉన్నాయి. అక్టోబర్ 26 నుంచి 28వ తేదీల్లో మలేషియా వేదికగా ఈ ఆసియాన్ సమ్మిట్ నిర్వహించనున్నారు. ఈ ఆసియాన్ సమ్మిట్‌లో మోదీ-ట్రంప్ భేటీ జరిగితే.. ఆ తర్వాత వచ్చే నవంబర్ నెలలో భారత్‌లో జరగనున్న క్వాడ్ లీడర్స్ సమ్మిట్‌కు ట్రంప్ హాజరు అయ్యే అవకాశాలు ఉంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే క్వాడ్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు భారత్‌కు వస్తానని ఇప్పటికే ప్రధాని మోదీకి ట్రంప్ హామీ ఇచ్చారు. అయితే.. ట్రంప్ భారత్ టూర్‌కు సంబంధించి వైట్‌హౌస్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ నెల చివర్లో జరిగే ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీకి ప్రధాని మోదీ వెళ్లడం లేదని.. ఈ నేపథ్యంలోనే మోదీ, ట్రంప్ భేటీ కావాలంటే దానికి ఆసియాన్ సమ్మిట్ వేదిక అవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## కవితకు నో ఎంట్రీ

మొదటి పేజి తరువాయి

చెప్పారు కానీ ఇప్పటి వరకూ చేయలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును కూడా సీబీఐకి ఇస్తున్నారని జరుగుతున్న ప్రచారంపైనా రేవంత్ స్పందించారు. ప్రస్తుతం ఫోన్ ట్యాపింగ్ అంశం హైకోర్టు పరిధిలో ఉందని.. లేకపోతే సీబీఐకి ఇచ్చే వాళ్లమన్నారు. కల్వకుంట్ల కవిత వ్యవహారం .. వారి కుటుంబ సమస్య అని రేవంత్ స్పష్టం చేశారు. అయితే కవిత కాంగ్రెస్ పార్టీలోకి వస్తానంటే మాత్రం వ్యతిరేకిస్తానని తెలిపారు. కవితపై హరీష్ రావు, కేటీఆర్, కేసీఆర్, సంతోష్ రావు దాడి చేస్తున్నరని సానుభూతి తెలిపారు. వారి కుటుంబంలో ఆస్తి పంచాయతీ నడుస్తోందని.. తనకు సంబంధం లేదని రేవంత్ స్పష్టం చేశారు. కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు సామాజికంగా బహిష్కరించారని రేవంత్ స్పష్టం చేశారు. కేసీఆర్ ఉద్యమం పేరుతో యువతను పొట్టన పెట్టుకున్నారన్నారు. ఇప్పుడు ఆ ఉసురు తాకే కుమార్తె దూరమైందని రేవంత్ వ్యాఖ్యానించారు. గతంలో నా కూతురు పెళ్లికి వెళ్లకుండా అడ్డుకున్నారని గుర్తు చేశారు. మంత్రులను తాను భయపెట్టడం లేదని.. ఎవరి పని వారు చేసుకుంటున్నారని రేవంత్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలపైనా రేవంత్ చర్చించారు. నెలాఖరులోపు స్థానిక ఎన్నికలు నిర్వహించడం అసాధ్యమన్నారు. అందుకే స్థానిక ఎన్నికల నిర్వహణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. ఈ అంశంపై న్యాయనిపుణులను సంప్రదిస్తున్నామని తెలిపారు. బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ లకు సుప్రీంకోర్టు ఇచ్చిన 90 రోజుల గడువుపై...సుప్రీంకోర్టులో తుది తీర్పు వచ్చే వరకూ ఎదురు చూస్తామన్నారు. పార్టీ ఫిరాయింపుల అంశంపైనా రేవంత్ స్పందించారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై నిర్దిష్టమైన నియమాలు ఏవీ లేవని గుర్తు చేశారు. స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాల్సి ఉందన్నారు. కండువా వేసుకున్నంత మాత్రానా పార్టీ ఫిరాయించినట్లేనా అని ప్రశ్నించారు. మెట్రో వివాదంపైనా రేవంత్ ఘాటుగా స్పందించారు. ఎల్ అండ్ టీ తాము చెప్పినట్లుగా వినాల్సిందేనని.. కేసీఆర్‌తో కుమ్మక్కయితే ఊరుకునేది లేదన్నారు. ఢిల్లీ వెళ్లినప్పుడల్లా రేవంత్ ఇలా మీడియా సమావేశంలో ఇష్టాగోష్టితో రాజకీయంగా సంచలనాత్మకమైన ప్రకటనలు చేశారు. కాళేశ్వరం కేసు ను సీబీఐకి ఇవ్వడంపైనా ఆయన వ్యూహాత్మకంగా వ్యవహరించారని ఇప్పుడు బీజేపీకి ఎలా స్పందించాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. ఈ క్రమంలోనే కిషన్ రెడ్డిపై ఆరోపణలతో.. రేవంత్ రెడ్డి బీజేపీపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేశారు.

## రాహుల్‌కు సిగ్గు లేదు

మొదటి పేజి తరువాయి

ప్రజాస్వామ్యాన్ని పట్టపగలు ఖూనీ చేయడమేనని మండిపడ్డారు. రాహుల్ గాంధీకి సిగ్గు,శరం ఉంటే బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. అప్పుడే ఆయనకు ఓట్ల చోరీ గురించి మాట్లాడే నైతిక అర్హత ఉంటుందని స్పష్టం చేశారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యం గురించి పాఠాలు చెప్పి, గల్లీలో అదే ప్రజాస్వామ్యా న్ని అపహాస్యం చేయడం కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీకి వెన్నతో పెట్టిన విద్య అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని దేశమంతా తిరుగుతూ ఈవీఎంల ట్యాంపరింగ్, ఓట్ల దొంగతనం గురించి ఉపన్యాసాలు ఇస్తున్న రాహుల్ గాంధీకి, తెలంగాణలో ఆయన పార్టీ చేస్తున్న ఎమ్మెల్యేల దొంగతనం కనిపించకపోవడం కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏలో ఉన్న ద్వంద్వ ప్రమాణాలకు , రాహుల్ గాంధీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనం అని విమర్శించారు. బీఆర్ఎస్ సిద్ధాంతాలు కేసీఆర్ నాయకత్వాన్ని విశ్వసించి తెలంగాణ ప్రజలు గెలిపించిన పది మంది ఎమ్మెల్యేలను అధికార మదం, డబ్బును ఎరగా చూపించి కాంగ్రెస్ లో చేర్చుకోవడం అనైతికం, సిగ్గుమాలిన చర్య కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజా తీర్పును కాలరాసి కాంగ్రెస్ చేసిన సిగ్గుమాలిన చర్య ఓట్లను దొంగిలించడం కంటే ఘోరమైన నేరం అన్నారు. ఓట్ చోరీ గురించి మాట్లాడే ముందు, తెలంగాణలో కాంగ్రెస్ చేసిన ఎమ్మెల్యేల చోరీపై సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజాతీర్పును అపహాస్యం చేసి సంతలో పశువుల్లా తెలంగాణ లో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన తీరుపై భారత్ జోడో న్యాయ్ యాత్ర చేసిన రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలన్నారు కేటీఆర్. ఫిరాయింపులతో తెలంగాణ ప్రజలకు ఆయన ఏం సందేశం ఇస్తున్నారో చెప్పాలన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే, పార్టీ మారిన ఎమ్మెల్యేలందరితో రాజీనామా చేయించి, ఉప ఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు. ఎవరి బలం ఏంటో ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామన్నారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించకుండా రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు అనిపిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపు రాజకీయాలను తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటున్నారని, సరైన సమయంలో ఆ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని కేటీఆర్ హెచ్చరించారు.

## రాష్ట్రంలో ఫిరాయింపుల హీట్

మొదటి పేజి తరువాయి

స్పీకర్ నోటీసులు జారీ చేయడం సంచలనంగా మారింది.

**ఆరుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు...**

ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంలో కీలకమ లుపు చోటు చేసుకుంది. ఈ అంశంపై సుప్రీం కోర్టు ఆదేశాలతో దూకుడుగా ఉన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆరుగురు ఎమ్మెల్యేలకు నోటీసు లు ఇచ్చారు. ఫిరాయింపులకు పాల్పడలేదు అనడా నికి మరిన్ని ఆధారాలు సమర్పించాలని నోటీసులు ఇచ్చారు. స్పీకర్ నుంచి నోటీసులు అందుకున్న ఎమ్మెల్యేల జాబితాలో బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), సంజయ్(జగిత్యాల), గూడెం మహిపా ల్ రెడ్డి(పటాన్ చెరు), పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ), కాలె యాదయ్య(చేవెళ్ల), తెల్లం వెం కట్రావు (భద్రాచలం)లు ఉన్నారు. ఫిరాయింపు అభియోగాలకు సంబంధించి ఈ నోటీసుల్లో పేర్కొన్నారు.

**మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలి...**

ఇకపోతే నోటీసులపై ఎమ్మెల్యేలు తమ వివరణను అఫిడవిట్ రూపంలో అందజేయాలని...తదుపరి విచారణ కోసం లీగల్ ఫార్మాట్‌లో అభ్యంతరాలను అందేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు. మూడు రోజుల్లోగా సమాచారాన్ని అందజేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కోరారు.

**ఫిరాయింపునకు పాల్పడ్డారంటూ బీఆర్ఎస్ వివరణ...**

ఇదిలా ఉంటే అంతకుముందు ఫిరాయింపు ఎమ్మెల్యేల వివరణపై బీఆర్ఎస్ సైతం తమ వివరణను స్పీకర్ కార్యాలయానికి అందజేసింది. బీఆర్ఎస్ పార్టీ బీఫామ్‌పై గెలుపొంది కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు ఫిరాయింపుల చట్టం నుంచి తప్పించుకునేందుకు ఎత్తుగడలు వేస్తున్నారని మాజీమంత్రి జగదీశ్ రెడ్డి ఆరోపించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు అమాయకత్వాన్ని నిరూపించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు స్పీకర్‌కు ఇచ్చిన వివరణపై బీఆర్ఎస్ పార్టీ తరఫున వివరణ ఇచ్చారు.తమ పార్టీ తరఫున వివరణ ఇచ్చేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, వివేకానంద బీఆర్ఎస్ నేత ప్రభాకర్‌లు స్పీకర్‌ను కలిసేందుకు స్పీకర్ కార్యాలయానికి వెళ్లారు. అయితే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అందుబాటులో లేకపోవడంతో అసెంబ్లీ సహాయ కార్యదర్శిని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలిసి తమ వివరణను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.ఎన్ని చేసినా పదిమంది ఎమ్మెల్యేలు తప్పించుకోలేరు. వీళ్లంతా దొరికిపోయిన దొంగలు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.సీఎం రేవంత్ రెడ్డి మాటలు నమ్మి మోసపోయారని...వందకు వందశాతం శిక్షార్హులు. కోర్టుముందు తప్పించుకోలేరు అని చెప్పుకొచ్చారు. ఆ 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయం...ఉప ఎన్నికల్లో ప్రజలు వారికి కర్రు కాల్చి వాతపెట్టడం ఖాయమని మాజీమంత్రి జగదీశ్ రెడ్డి నిలదీశారు.

**10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు...**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశం కుదిపేస్తోంది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలకు ఉపక్రమించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బీఫాం తీసుకుని కారు గుర్తుపై గెలిచి అధికార పార్టీకి దగ్గరైన 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారు. ఫి రాయింపు నేపథ్యంలో ఎందుకు చర్యలు తీసుకోకూ డదో వివరణ ఇవ్వాలని కోరారు. దీంతో ఇటీవల స్పీకర్‌ను కలిసిన సదరు ఎమ్మెల్యేలు తమపై వచ్చిన ఆరోపణలపై లిఖితపూర్వకంగా వివరణ అందజేశారు.

**బీఆర్ఎస్ పార్టీని వీడ లేదంటున్న ఫిరాయింపు ఎమ్మెల్యేలు...**

తాము బీఆర్ఎస్ పార్టీని వీడలేదని...బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం రద్దు చేసుకోలేదు అని స్పీకర్‌కు ఫిరాయింపు ఎమ్మెల్యేలు వివరణ ఇచ్చారు. ఇప్పటికీ అదే పార్టీలో కొనసాగుతున్నామని తెలిపారు. తాము కేవలం నియోజకవర్గ అభివృద్ధి పనుల గురించి చర్చించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసినట్లు వివరణ ఇచ్చారు. తాము పార్టీ మారినట్లుగా తప్పుడు ప్రచారం చేసేందుకు తమ ఫొటోలను మార్ఫింగ్ చేశారని వారు తమ వివరణలో పేర్కొన్నారు.

### ఆర్టీసీ స్పెషల్ బాదుడు

మొదటి పేజి తరువాయి

ప్రజల నడ్డి విరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతుండటం సిగ్గుచేటు అని మండిపడ్డారు. 'పల్లె వెలుగు సహా అన్ని రకాల ఆర్టీసీ బస్సుల్లో టికెట్ ధరలు విపరీతంగా పెంచి బతుకమ్మ, దసరా పండుగ సమయంలో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల నుంచి ముక్కు పిండి ఛార్జీలు వసూలు చేయడం దుర్మార్గం' అని మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. 'అదనపు సర్వీసుల పేరిట 50 శాతం అదనపు ఛార్జీల దోపిడీ.. ప్రయాణికులకు పెను భారంగా మారుతున్నది. పండుగ సంబురం లేకుండా చేస్తున్నది' రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. 'ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచకుండా, రెగ్యులర్‌గా నడిచే బస్సులకే పండుగ స్పెషల్ బోర్డులు తగిలించి చేస్తున్న ఈ దోపిడీ ముమ్మాటికీ ప్రజాపీడనే అవుతుంది' అని ప్రకటించారు. 'తెలంగాణ ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ సంతోషాన్ని లేకుండా చేయడమేనా ప్రజా పాలన, ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి?' అని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీశ్ రావు నిలదీశారు. ప్రత్యేక బస్సుల్లో అదనపు ఛార్జీల భారాన్ని మోపద్దని డిమాండ్ చేశారు.

# అభివృద్ధిలో భాగస్వాములు కండి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

భవిష్యత్ తరాలకు అవకాశాలను సృష్టించాలనేది తమ ఆలోచన అని తెలిపారు. దేశంలో యంగెస్ట్ స్టేట్ (కొత్త రాష్ట్రం) తెలంగాణ అని ఉద్ఘాటించారు. కొత్త రాష్ట్రమైనా తెలంగాణ, హైదరాబాద్‌కు ఘనమైన చరిత్ర ఉందని నొక్కిచెప్పారు సీఎం రేవంత్‌రెడ్డి. ఢిల్లీలో పబ్లిక్ ఎఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా 12వ వార్షిక సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047 రూపొందించామని వివరించారు. తెలంగాణను కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్‌గా విభజించామని వెల్లడించారు. కోర్ అర్బన్ ఏరియాలో కోటి మంది నివసిస్తున్నారని... ఇక్కడ కాలుష్యకారక పరిశ్రమలను నగరం వెలుపలికి తరలిస్తున్నామని తెలిపారు. సెమీ అర్బన్ ఏరియాను తయారీ రంగం జోన్‌గా (మాన్యుఫాక్చర్) నిర్ణయించామని చెప్పుకొచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి .



**మెట్రో పొడిగింపు...**

తెలంగాణ అభివృద్ధికి తగినట్లు 70 కిలోమీటర్లు ఉన్న మెట్రోను 150 కిలోమీటర్లు పొడిగించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ప్రస్తుతం అయిదు లక్షల మంది మెట్రోలో పయనిస్తున్నారని.. దానిని 15 లక్షలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పుకొచ్చారు. సబర్మతీ తీరంలా మూసీని మారుస్తామని.. అందుకు మూసీ పునరుజ్జీవంపై దృష్టి సారించామని తెలిపారు. 2027 నాటికి హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ వాహనాలే ఎక్కువగా ఉండనున్నాయని.. అందుకే ఈవీలకు రాయితీలు ప్రకటించామని పేర్కొన్నారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

**భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం...**

'రాష్ట్ర అవసరాలకు తగినట్లు రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం చేస్తున్నాం. భవిష్యత్ అవసరాలకు తగినట్లు భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. విమానాశ్రయం నుంచి భారత్ ఫ్యూచర్ సిటీ అనుసంధానిస్తాం. తెలంగాణలో సేంద్రియ పంటలు పండుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా డ్రగ్స్ సమస్య ఉంది.. మేం తెలంగాణలో డ్రగ్స్‌ను కంట్రోల్ చేశాం. డ్రగ్స్ నిర్మూలనలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. జ్ఞానంతో పాటు నైపుణ్యం అవసరం. యువతలో నైపుణ్యాలు పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

**స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు...**

'మహాత్మా గాంధీ యంగ్ ఇండియా స్ఫూర్తిని అనుసరిస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో చదువుకున్న వాళ్లకు ఉద్యోగాలు వస్తాయి. స్పోర్ట్స్‌లో దక్షిణ కొరియా వంటి చిన్న దేశాలకు వచ్చే మెడల్స్ చూస్తే ఆశ్చర్యం కలుగుతోంది. ఒలింపిక్స్‌లో పతకాల సాధనే లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. తెలంగాణకు భూపరివేష్టిత రాష్ట్రం (ల్యాండ్ లక్డ్) కావడంతో ఓడ రేవు లేదు. మచిలీపట్నం ఓడ రేవు అనుసంధానానికి ఫ్యూచర్ సిటీ నుంచి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే.. దానికి సమాంతరంగా రైల్వే లైన్ మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. 2025, డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తాం. బల్క్ డ్రగ్స్ ఉత్పత్తిలో 40 శాతం తెలంగాణనే చేస్తోంది. వ్యాక్సిన్ల తయారీలో హైదరాబద్ ముందు వరుసలో ఉంది' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# కడియం కహానీ..!

మొదటి పేజి తరువాయి

కొంతైనా పూడ్చవచ్చని కాంగ్రెస్‌తో పని చేస్తున్నానని, ఉపముఖ్యమంత్రిగా ఉన్నని రోజులు నియోజకవర్గంలో అడుగుపెట్టలేదని కడియం శ్రీహరి అన్నారు. కేసీఆర్ ఢిల్లీలో ఉన్న తనను పిలిచి ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చారని ఆయన తెలిపారు.

**రాజకీయ వ్యవస్థను భ్రష్టు పాటించారు...**

రాజకీయ వ్యవస్థను కేసీఆర్ భ్రష్టు పట్టించారని కడియం శ్రీహరి ఆరోపించారు. కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో వివిధ పార్టీల నుంచి 36 మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని అందులో శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డికి మంత్రిపదవులు ఇచ్చారని కడియం గుర్తు చేశారు. ఆనాడు కేసీఆర్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారని ఎవరితో రాజీనామా చేయించలేదని తెలిపారు. సభ్యత్వం రద్దు కాలేదని కడియం అన్నారు. అధికారం కోల్పోయిన తరువాత ఫాం హౌస్‌కు పరిమితమైన కేసీఆర్‌కు ఇప్పుడు రాజకీయాలు గుర్తుకు వచ్చాయా అని ప్రశ్నించారు. మీరు చేస్తే సంసారం.. మరొకరు చేస్తే వ్యభిచారమా అని ఘాటుగా స్పందించారు. కేసీఆర్ తెలంగాణాను ఆగమం చేశారని కడియం ఆరోపించారు. నేను రాజకీయాల్లో ఎవరికీ పాదాభివందనం చేయలేదని.. నీతి.. నిజాయితీతో రాజకీయాల్లో ప్రజల కోసం పని చేస్తున్నానని అన్నారు.

**స్పీకర్ పరిధిలో ఎమ్మెల్యేల అంశం...**

పార్టీ మారారని బీఆర్ఎస్ సుప్రీం కోర్టుకు వెళ్లిందని కోర్టు మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని చెప్పిందే తప్ప, సభ్యత్వాన్ని రద్దు చేయమని చెప్పలేదని కడియం శ్రీహరి అన్నారు. స్పీకర్ తనకు వివరణ ఇవ్వాలని నోటీస్ ఇచ్చారని వివరణ ఇచ్చే సమయంలో ఉందని కడియం చెప్పారు. ఏదీ ఏమైనా స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని కడియం శ్రీహరి స్పష్టం చేశారు

**ఫిరాయింపులను వ్యతిరేకం...**

పార్టీ ఫిరాయింపులకు కడియం శ్రీహరి వ్యతిరేకమని, వ్యక్తిగతంగా ఫిరాయింపులను సమర్థించబోనని కడియం అన్నారు. కానీ నియోజకవర్గ ప్రజలు, అభివృద్ధి కోసం తప్పని పరిస్థితుల్లో పార్టీ మారాల్సి వస్తుందని కడియం చెప్పారు. నేను పార్టీలో ఉన్నాననే స్పీకర్ చెబుతానని కడియం చెప్పారు.

**నాకు కూడా బూతులు వచ్చు...**

మెడిసిన్ చదువుకొని కొంతమంది సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని కడియం మండిపడ్డారు. రాజకీయ విమర్శలు కాకుండా వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారన్నారు. రాజకీయ విమర్శలు ఉండాలే కానీ వ్యక్తిగత విమర్శలు ఉండకూడదని పరోక్షంగా రాజయ్యకు చురకలంటించారు. నాకు బూతులు వచ్చు.. మాటలు వచ్చు, పుట్టింది అదే కాలనీలోనేనని కడియం అన్నారు. తాను మాట్లాడేందుకు సభ్యత, సంస్కారం అడ్డు వస్తుందని తెలిపారు. వాళ్ళ వ్యాఖ్యలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. 15 సంవత్సరాలు అధికారంలో ఉండి చిలిపి పనులు, దళిత బంధు, బి ఫాం అమ్ముకున్న వ్యక్తులతో విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని రాజయ్యపై మండిపడ్డారు.

**ప్రజలు, నియోజకవర్గ అభివృద్ధి కోసం పని చేస్తున్నా...**

స్టేషన్ అభివృద్ధికి సీఎం చొరవ తీసుకున్నారన్నారు కడియం. 148 కోట్లు దేవాదుల ఉప కాల్వల కోసం నిధులు ఇచ్చారన్నారు. దీనివల్ల చివరి ఆయకట్టు వరకు గోదావరి నీళ్లు వెళ్తున్నాయని వివరించారు. తొలిసారి అనేక చెరువులు నింపుకున్నామని సవరించిన 1015 కోట్లతో ప్యాకేజీ 6తో రిజర్వాయర్లు, చెరువులు నింపనున్నామన్నారు. గోదావరి జలాలతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు నీళ్లు ఇస్తామన్నారు. ఇదంతా కాంగ్రెస్ వల్ల సాధ్యమైందని తెలిపారు. స్టేషన్ ను ఎడ్యుకేషన్ హబ్ చేయాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైందని కడియం తెలిపారు.

# సంక్షోభంలో మావోయిస్ట్ పార్టీలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

గత కొన్నేళ్లుగా దేశంలోని మావోయిస్టు విప్లవోద్యమ శిబిరాన్ని కకావికలం చేస్తున్నాయి. ఇప్పుడు ఆ శిబిరమే చీలిపోయిందన్న వాదన బలంగా వినిపించే ఘటన చోటు చేసుకుంది. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు మావోయిస్ట్ పార్టీని 2026 మార్చి నాటికి సమూలంగా నిర్మూలిస్తామని బహిరంగంగా ప్రకటిస్తోంది. ఆ దిశగానే నిర్మూలన చర్యలు తీవ్రతరం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో పార్టీ కేంద్ర కమిటీ కీలక నాయకుడు 'సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నట్లు' ప్రకటించడం విప్లవ శిబిరంలో తీవ్ర గందరగోళాన్ని సృష్టించింది. ఈ ప్రకటనపై మావోయిస్ట్ పార్టీ అధికార ప్రతినిధి 'జగన్' తీవ్ర అభ్యంతరం తెలుపుతూ, అది పార్టీ నిర్ణయం కాదని, ఈ పద్ధతి ఉద్యమానికి నష్టం కలిగిస్తుందని ఒక ప్రత్యేక పత్రికా ప్రకటన ద్వారా స్పష్టం చేశారు. పార్టీ ముఖ్య నాయకత్వంపై యుద్ధ దాడులు తీవ్రంగా కొనసాగుతున్న ఈ క్లిష్ట సమయంలో వచ్చిన ఈ తాజా ప్రకటన పార్టీలో అంతర్గత విభేధాలు, ఒత్తిడి ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తోంది.

**'కగార' ఆపరేషన్‌తో ఉక్కిరిబిక్కిరి...**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విప్లవోద్యమ నిర్మూలనకు చాలా ఏళ్ల నుంచి పథకాలు రచిస్తోంది. 'కగార' అనే పేరుతో భారీ స్థాయి యుద్ధ చర్యలను అమలు చేస్తోంది. ఈ చర్యల లక్ష్యం కేవలం క్యాడర్ మాత్రమే కాదు, నాయకత్వాన్ని, సహకరించే ప్రజలను కూడా నిర్మూలించడమేనని మావోయిస్టులు ఆరోపిస్తోంది. ఈ ఆపరేషన్ ఫలితంగా మావోయిస్టు పార్టీకి తీరని నష్టం వాటిల్లింది. మే 21న జరిగిన దాడిలో ఏకంగా పార్టీ ప్రధాన కార్యదర్శితో సహా 28 మంది కామ్రేడ్స్ చనిపోయారు. అంతేకాకుండా, జూన్ నుంచి సెప్టెంబర్ వరకు జరిగిన ఘటనలలో కేంద్ర కమిటీ సభ్యులు ఉదయ్ అలియాస్ గజరల్ రవి, మోడెం బాలకృష్ణ, పరేవశ సోరెన్ కూడా మృతి చెందారు. రాష్ట్ర కమిటీ సభ్యులు గౌతమ్, భాస్కర్, అరుణ, జగన్ అలియాస్ పండన్న, పండు అలియాస్ చంద్రహాస్ వంటివారు కూడా కన్నుమూశారు. ఈ భయంకరమైన దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో, కొంతమంది రాష్ట్ర కమిటీ సభ్యులు, కింది స్థాయి కమిటీ సభ్యులు అనారోగ్య సమస్యల రీత్యా పార్టీ అనుమతితోనే సరెండర్ అయ్యారని ప్రస్తుతం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు జగన్.

**శాంతి ప్రతిపాదనలు %-% ప్రభుత్వం వైఖరి...**

విప్లవ శిబిరంపై జరుగుతున్న యుద్ధ చర్యలను ఆపాలని దేశవ్యాప్తంగా ప్రజా సంఘాలు, ప్రజలు, మేధావులు, సంఘాలు, ప్రముఖులు విజ్ఞప్తులు చేశారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లోనూ 'కగార' యుద్ధ కాండను నిలుపుదల చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. 2025 మార్చిలో కొంతమంది ప్రజాస్వామిక మేధావులు 'పీస్ డైలాగ్ కమిటీ'గా ఏర్పడి, ప్రభుత్వానికి, మావోయిస్ట్ పార్టీకి మధ్య శాంతి చర్చలు జరగాలని ప్రతిపాదన చేశారు. దీనికి జవాబుగా కేంద్ర కమిటీ స్పందిస్తూ కూంబింగ్‌లు, హత్యకాండను ఆపాలని, కొత్త క్యాంపుల నిర్మాణం నిలుపుదల చేసి శాంతియుత వాతావరణంలోనే చర్చలు జరపాలని స్పష్టంగా ప్రకటించింది. అని లేఖలో పేర్కొన్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం ఈ డిమాండ్‌లను పట్టించుకోకుండా, ఎటువంటి సడలింపులూ లేకుండా యుద్ధ చర్యలను కొనసాగిస్తూనే ఉంది. బీజేపీ నాయకులు అయితే, తాము మావోయిస్టులతో చర్చించేది లేదని, ఆయుధాలు విడిచిపెట్టి సరెండర్ కావాలని పదే పదే ప్రకటిస్తున్నారని జగన్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఫాసిస్ట్ భావజాలంతో, రాజ్యాంగ వ్యతిరేకంగా, చట్ట వ్యతిరేకంగా నిర్మూలన కార్యక్రమాన్ని కొనసాగించి తీరుతామని బీజేపీ నాయకత్వం ప్రకటిస్తోందని ఆరోపించారు.

**పార్టీలో గందరగోళం: కామ్రేడ్ సోను ప్రకటనపై ఖండన...**

ఈ ప్రతికూల వాతావరణంలోనే, కీలకమైన అంతర్గత సంక్షోభం తెరపైకి వచ్చింది. కేంద్ర కమిటీ సభ్యుడైన కామ్రేడ్ సోను, సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నామని ప్రకటిస్తూ, తమ అభిప్రాయాలను తెలుసుకోవడానికి నెల రోజులు సమయం ఇవ్వాలని కోరారు. సుదీర్ఘంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ అభిప్రాయాలను తాను ఇచ్చిన ఇమెయిల్ అడ్రస్‌కు పంపాలని ఆయన కోరారు. ఇది సరైన పద్ధతి కాదని అని లేఖలో అభ్యంతరం వ్యక్తం చేశారు జగన్. ఒక సీనియర్ నాయకుడు, అదీ తీవ్ర దమనకాండ జరుగుతున్న సమయంలో, ఇంటర్నెట్ మాధ్యమంగా పార్టీ మౌలిక సిద్ధాంతమైన సాయుధ పోరాట విరమణ గురించి బహిరంగంగా ప్రకటించడం ఈ మొత్తం వ్యవహారంలో ప్రత్యేకతను సంతరించుకుంది. దీంతో పార్టీ శ్రేణులలో తలెత్తిన గందరగోళాన్ని తగ్గించడానికి జగన్ ఈ కీలక ప్రకటన చేశారు.

**బహిరంగ ప్రకటనకు ఖండన...**

కామ్రేడ్ సోను పద్ధతిపై అధికారిక ప్రతినిధి జగన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు, ఇది పార్టీ ముఖ్య ఉద్దేశాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. సోను అనుసరించిన పద్ధతి అర్థం కావటం లేదని తెలిపారు. ఒకవేళ ఎవరైనా ఉద్యమాన్ని విడిచిపెట్టాలని భావిస్తే పార్టీ కమిటీలో చర్చించి అనుమతి పొందవచ్చని చెప్పారు. తన అభిప్రాయాన్ని పార్టీ విభాగాలకు పంపించి ఉంటే జవాబులు దొరికేవి అన్నారు. అది చేయకుండా, ఈ విధంగా బహిరంగంగా ప్రకటిస్తే పార్టీ శ్రేణుల్లోనూ, విప్లవ శిబిరంలోనూ గందరగోళం తలెత్తుతుందని, ఈ పద్ధతి ఉద్యమానికి నష్టమే తప్ప ఉపయోగపడదని పార్టీ తేల్చి చెప్పింది. "దేశంలోని ఏ పార్టీ అయినా ఇటువంటి నిర్ణయాలను ఇంటర్నెట్ ద్వారా బహిరంగ చర్చకు పెట్టి పరిష్కరించాలని చూస్తారా." అని జగన్ ప్రశ్నించారు. అటువంటిది, రహస్య పార్టీ, కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలకు కట్టుబడిన పార్టీ, తీవ్రమైన యుద్ధ చర్యలు అమలు అవుతున్న వేళ మంచిగా ఆలోచించేవారు ఇలా చేయరని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యపై పార్టీలోపై స్థాయి నుంచి కింది స్థాయి వరకు అందరూ తీవ్రంగానే ఆలోచిస్తున్నారని, అనవసరంగా నష్టపోవాలని ఎవరూ అనుకోవడం లేదని పార్టీ తెలిపింది. అయితే, ఈ సమస్యకు పరిష్కారం బహిరంగ ప్రకటనలతో అయ్యేది కాదని, భయంకరమైన దమనకాండలో ఇటువంటి నష్టాలు సహజంగానే జరుగుతాయని అర్థం చేసుకోవాలని సూచించింది. కామ్రేడ్ సోను ప్రకటన పార్టీ అధికారిక ప్రకటన కాదని, విప్లవ శిబిరం, మిగిలిన రాజకీయ పార్టీలు దీనిని అధికారిక ప్రకటనగా గుర్తించాల్సిన అవసరం లేదని, దీనితో గందరగోళ పడాల్సిన అవసరం లేదని అధికార ప్రతినిధి తేల్చిచెప్పారు. 2024లో పొలిట్ బ్యూరో విడుదల చేసిన సర్క్యులర్‌ను అమలు జరపటమే తక్షణ కర్తవ్యం అన్నారు. ఫాసిస్ట్ బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను మరింత తీవ్రతరం చేయాలి అని పార్టీ తన శ్రేణులకు, విప్లవ అభిమానులకు పిలుపునిచ్చింది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం
20.09.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**నాచారం, విశాలభారతి:**

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్సీ బస్తి, ఓల్డ్ మల్లాపూర్, ఎస్వీ నగర్ కాలనీల్లో 70 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే శ్రీ బండారి లక్ష్మారెడ్డి,కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి జిహెచ్ఎంసి డి ఈ రూపా, ఏఈ శ్రవంతి, వర్క్ ఇన్స్పెక్టర్ భిక్షపతి, స్థానిక నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# వంట సామాగ్రి అందజేయాలి

### డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ డిమాండ్

**సికింద్రాబాద్, విశాలభారతి:**



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 75 సంవత్సరాల జన్మదిన పురస్కరించుకొని దేశవ్యాప్తంగా 15 రోజులు సేవా పక్షం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బౌద్ధనగర్ డివిజన్ లోని ఎల్ నారాయణ నగర్, పార్సిగుట్ట, న్యూ అశోక్ నగర్ బస్తీలలో డివిజన్ బిజెపి అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ పాదయాత్ర నిర్వహించడం జరిగింది . కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ పాల్గొని మాట్లాడుతూ నాలా పరివాహక ప్రాంతాలలో వర్షపు నీరు చుట్టు పక్కల ఇళ్లలో ప్రవహించి బియ్యం పప్పు దినుసులు, పుస్తకములు వంట సామాగ్రి అనేక వస్తువులు తడిసి ముద్దాయి దుర్వాసన మూలంగా ఈ యొక్క ప్రాంతాలు వ్యాపించగా ఉదయం స్వచ్ఛభారత్ నిర్వహించి జిహెచ్ఎంసి, హైడ్రా, మలేరియా సిబ్బందితో కలిసి శుభ్రపరచడం జరిగిందని మాజీ కార్పొరేటర్ సరుపగౌడ్ తెలిపారు. వర్షాకాల సమయంలో పరిసరాలను అదే విధంగా మన నివావాసాలలో ఉన్నటువంటి సౌచాలయాలను కూడా తడి లేకుండా శుభ్రపరచుకోవాలని అదేవిధంగా అహర్నిశలు కృషి చేస్తున్న జిహెచ్ఎంసి, జలమండలి, హైడ్రా సిబ్బంది కూడా ఆరోగ్యంగా ఉండాలని స్వరూప గౌడ్ తెలిపారు. నాలా పరివాహక ప్రాంతాలు అదే విధంగా లోతట్టు ప్రాంతాలలో ముంపునకు గురైన నివాస వాసులకు వంట సామాగ్రి, ఆహార పదార్థాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అందజేయాలని మండల అధికారులు వెంటనే పర్యటించి నివాసులకు మేలు చేయాలని స్వరూప గౌడ్ కోరారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ,దత్తు,మద్దెర్ల శ్యాంసుందర్, సుధాకర్ లడ్డు, కుమార్,లింగం, బబ్లు,నాగరాజు, వెంకటేష్, జయంత్, సుబ్బారావు, శ్రీనివాస్, దీపక్, సురేష్,మహమూద్, అమరావతి, సరిత, పార్వతమ్మ, శారద, ఇందిర, బస్తీ వాసులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**వలిగొండ, విశాలభారతి:**

వలిగొండ రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి లబ్దిదారులకు పలు సంక్షేమ పథకాల కింద చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 50 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముభారక్ చెక్కులు, 94 సిఎం ఆర్ఎఫ్ చెక్కులు మొత్తం రూ.34,71,500/- విలువైనవి అందజేశారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదల పక్షాన నిలబడుతుంది. పేద కుటుంబాల కష్టాలను అర్థం చేసుకుని వారికి అండగా నిలవడమే మా లక్ష్యం. ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా ఇల్లు లేని వారికి గృహం కల్పిస్తాం. కరెంటు బిల్లుల భారం తగ్గించే విధంగా సబ్సిడీలు, గ్యాస్ పై సబ్సిడీ, మహిళలకు ఆర్థికంగా తోడ్పడే పథకాలన్నీ కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమవుతాయి" అని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు మండలాధికారులు ప్రజా సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## హిందీ భాషను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి

**తొర్రూరు, విశాలభారతి:**

హిందీ భాషను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా నేర్చుకోవాలని శ్రీ వెంకటేశ్వర ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జాటోతు రమేష్ నాయక్ అన్నారు. మేరా యువభారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, సూపరిటెండెంట్ బానోతు దేవీలాల్ ఆదేశాల మేరకు హిందీ పక్వాడ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం డివిజన్ కేంద్రంలోని వెంకటేశ్వర ఒకేషనల్ జూనియర్ కళాశాలలో హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. దానిలో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మేరా యువభారత్ జిల్లా యువ సమన్వయకర్త బానోతు వీరన్న నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ రమేష్ నాయక్ మాట్లాడారు. జాతీయ ఉద్యమంలో దేశాన్ని జాగృతం చేసి ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష దోహద పడిందని తెలిపారు. కేంద్ర అధికార హోదా అందుకున్న భాష హిందీ అని, దేశంలో అత్యధికలు మాట్లాడే భాష ఇదేనని తెలిపారు. భాషాపరంగా ఎంతో వైవిధ్యం ఉన్న దేశ ప్రజలను ఒకటి చేసేది హిందీ భాషేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు భూక్య శ్రీనివాస్ నాయక్, మచ్చసాగర్, ప్రతినిధులు రాజు నాయక్, సురేష్ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.



## నేటి బాలలే రేపటి పౌరులు

### సీఐ మన్మధ కుమార్

**చౌటుప్పల్ విశాలభారతి:**

మండలంలొని దేవలమ్మ నాగారం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ మరియు ప్రైమరీ స్కూల్లో విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ ఆధ్వర్యంలో ట్రెజరీ లయన్స్ చిలువేరు మంగయ్య దాతృత్వంతో విద్యార్థులకు టైలు,బెల్టులు చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్ చేతులు మీదుగా పంపిణీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా సీఐ మన్మధ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంచి సౌకర్యాలు కల్పించాలని మరియు నేటి బాలలే రేపటి పౌరులని నవ సమాజ స్థాపనకు చేయూతనియాలని అన్నారు. అలాగే దాత సిలివేరు మంగయని అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు తిరందాజ్ జగన్,ఎంఈఓ గురువారావు,మాజీ సర్పంచ్ కళ్లెం శ్రీనివాస్ రెడ్డి,ప్రధానోపాధ్యాయులు కోమటిరెడ్డి నరసింహారెడ్డి, మహమ్మద్ పాషా, వెంకటేశం, వేముల నరసింహ,బోలోజు రాజు చారి,చింతల ప్రభాకర్ రెడ్డి, సిలివేరు శివ తదితరులు పాల్గొన్నారు.




## ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఘటనపై చర్యలు తీసుకోవాలి

**నాచారం, విశాలభారతి:**

ధన దోపిడీపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల భద్రతపై లేకపోవడం సిగ్గుచేటు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బాధిత విద్యార్థి వైద్య ఖర్చులు యాజమాన్యమే భరించాలి ఈ ఘటనపై పోలీసులను తప్పుదోవ పట్టించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఛైర్మన్ మల్క కొమురయ్య పై కేసు నమోదు చేయాలి ఏఐవైఎఫ్,ఏఐఎస్ఎఫ్ డిమాండ్ నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో 9వ తరగతి చదవుతున్న విద్యార్థిని తోటి విద్యార్థులు చిత్రహింసలు పెట్టి బర్త్ డే బంప్స్ పేరిట ప్రయివేటు పార్ట్స్ పై దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని,ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యంకు ధన దోపీడీపై ఉన్న శ్రద్ధ. విద్యార్థుల భద్రతపై లేకపోవడం సిగ్గుచేటని నిరసిస్తూ,దాడి ఘటనపై పోలీసులు, విద్యాశాఖ అధికారులు నిష్పక్షపాతంగా పూర్తి స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్యఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ముందు ధర్నా నిర్వహించారు.

## ఓపెన్ జిమ్ పనులను పరిశీలించిన కటికరెడ్డి అరవింద్ రెడ్డి



**ఎల్బీనగర్ విశాలభారతి:**

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వైదేహినగర్ నార్త్ కాలనీలో జరుగుతున్న ఓపెన్ జిమ్ పనులను బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మరియు కాలనీ వాసులతో కలిసి పరిశీలించడం జరిగింది. బి ఏన్ రెడ్డి నగర్ డివిజన్ లోని పరిధిలోని 9 కాలనీలలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సహకారంతో దాదాపు 1,55,00,000 రూపాయలతో ఓపెన్ జిమ్ లు ఏర్పాటు చేస్తున్నామని త్వరలో 9 కాలనీలలో ఈ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకరానున్నట్టు అరవింద్ రెడ్డి తెలిపారు. అలాగే ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ సభ్యుల మరియు కాలనీ వాసులు ఎమ్మెల్యే కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైదేహినగర్ నార్త్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు పోగుల రాంబాబు, సెక్రటరీ రాజేందర్ రెడ్డి,సభ్యులు నాగ రాజా, రామ్నాథ్ రెడ్డి,వెంకట్ రెడ్డి ,వేణుగోపాల్, పి డి వి ప్రసాద్, రామిరెడ్డి, చక్రధర్ రెడ్డి, వేణుగోపాల్ కాలనీవాసులు కె ఎస్ ఆర్ ఆంజనేయులు, నరసింహారావు, నాగభూషణం, రాజేశ్వరరావు, సీతా మెహర్, ఖలీల్, వెంకటరామిరెడ్డి, అయ్యప్ప, కేతిరెడ్డి రాము, రాములు, బాబి, నూరుద్దీన్, అబ్దుల్ రాజాక్, శ్రీహరి, ఈమని కృష్ణ, దుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలి



**తొర్రూర్, విశాలభారతి:**

మహబూబాద్ జిల్లా తొర్రూరు పట్టణం గోపాల గిరి క్రాస్ రోడ్ లో నిర్మించిన డబుల్ బెడ్ రూములు అర్హులైన పేదలకు ఇవ్వాలని డబుల్ బెడ్ రూమ్ ల వద్ద అర్హులైన పేద మహిళలందరూ బతకమ్మ ఆట ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎం) మండల కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు మహమ్మద్ యాకోబు, జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్ లు సంయుక్తంగా మాట్లాడుతూ...గత నాలుగు నెలల నుంచి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయి అర్హులైన పేదలకు ఇల్లు ఇవ్వాలని సిపిఐ (ఎం) పార్టీ ఆధ్వర్యంలో దశల వారి పోరాటాలు చేసామన్నారు. ఆయన అధికారుల్లో స్పందన లేకపోవడంతో అర్హులైన పేద మహిళలు డబల్ బెడ్ రూమ్ ల వద్ద బతుకమ్మ పండుగను చేస్తూ, పాటలు పాడుతూ నిరసన తెలిపారు. ఈరోజు నుంచి తొమ్మిది రోజులు బతకమ్మ నిరసనలు తెలుపుతామని విజయదశమి దసరా పండుగ రోజు అర్హులైన పేదలతో గృహప్రవేశాలు చేస్తామని సిపిఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు ఎండి యాకూబ్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్ లు హెచ్చరించారు. గత ప్రభుత్వంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఈ ఇండ్లను ఆ ప్రభుత్వం ఇవ్వలేక, ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా పాలన ఈ ప్రభుత్వం అయినా ప్రజల పక్షాన ఉంటుందని పేదలందరూ ఆశిస్తున్నారు అని అన్నారు. ఇప్పటికైనా అధికారులు ఇచ్చిన మాటపై లబ్ధిదారులను ఎంపిక చేయాలని వారు కోరారు. లేనియెడల విజయదశమి సందర్భంగా లబ్ధిదారులతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఆక్రమించి గృహప్రవేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) పార్టీ మండల కమిటీ సభ్యులు జమ్ముల శ్రీను, దొనక దరగయ్య, బొల్లం మమత, ధరావత్ యాకన్న, తిమ్మిటి రవి, ఎస్.కె అమీర్, కొమ్మనబోయిన యాకయ్య, డబల్ బెడ్ రూమ్ అర్హులైన పేద లు శ్రీలత, శోభ తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ ఆధ్వర్యంలో చిత్రలేఖణం పోటీలు

**చౌటుప్పల్, విశాలభారతి:**

భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ శాఖ,సేవా పక్వాడ్, మహిళా మోర్చా ఆధ్వర్యంలో భారత ప్రధాని గౌరవనీయ నరేంద్ర మోడీ 75వ జన్మదినం పురస్కరించుకొని ఆత్మ నిర్భర భారత్,వికసిత్ భారత్, కార్యక్రమాలు మున్సిపాలిటీ తంగడపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో చిత్రలేఖనం పోటీలు నిర్వహించడం జరిగింది. భారత ప్రధాని నరేంద్ర మోడీ దేశాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్తున్న సందర్భంగా గౌరవ ప్రధాని అభినందనలు తెలుపుతూ చౌటుప్పల్ మున్సిపల్ నాయకులు కార్యకర్తలు ఈ యొక్క ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగింది. విద్యార్థులతోటి ఆత్మనిర్భార్ భారత్,వికసిత్ భారత్ చిత్రాలను ప్రధానోపాధ్యాయుల చొరవతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి చౌటుప్పల్ పట్టణ అధ్యక్షులు కడారి కల్పన యాదవ్,మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్,జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రమణ గోని శంకరయ్య,సేవా పక్వాడ్ కన్వీనర్ ఆలె చిరంజీవి,లింగోజిగూడెం మాజీ సర్పంచ్ రమణ గోని దీపిక,పట్టణ మహిళా మోర్చా అధ్యక్షులు ఉడుగు విజయలక్ష్మి,మున్సిపల్ నాయకులు ముత్యాల భూపాల్ రెడ్డి ప్రాథమిక ఉన్నత ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్‌ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే

### కార్యక్రమంలో పాల్గొన్న మల్లాపూర్ కార్పొరేటర్

**నాచారం, విశాలభారతి:**

మిక్కిలినేని మను చౌదరీ, ఐ.ఎ.ఎస్ ని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి తో కలిసి మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నేహ్రూనగర్ కాలనీకి ఎదురుగా,న్ ఎఫ్ సి కంపెనీ ప్రహరీగోడను అనుకోని ఉన్న పిసిఐఐసి కీ సంబంధించిన మల్లాపూర్ గ్రామ సర్వే నెం 44, 45 లోని ఎన్ ఎఫ్ సి వారు వదిలినటువంటి నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలము కబ్జాలకు గురవుతున్నది, ఇట్టి స్థలాన్ని అప్పట్లో త్రిక్ మౌలాలి ఐ ఏ ఎల్ ఏ వారికీ ప్రభుత్వం వారు అప్పగించాడము జరిగింది అని ఆయన అన్నారు. నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాన్ని ప్రభుత్వం వారు స్వాధీనం చేసుకొని స్థానిక కాలనీ వాసులకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాలు మరియు పార్కును అభివృద్ధి చేస్తే స్థానిక ప్రజలకు చాల ఉపయోగకరంగా ఉంటుందని, స్థానిక ప్రజల కోరిక మేరకు తమరిని కోరడమైనది అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు తెలిపారు. ఎన్ ఎక్స్ సి అనుకోని కడుతున్న ప్రవారీ గోడ నీ ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోదాసు లక్ష్మి నారాయణ, నాగారం బాబు, దుర్గయ్య, నాగారం చంద్ర శేఖర్ రాపోల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం
20.09.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ఘనంగా సుబ్బరాజు జన్మదిన వేడుకలు



**కూకట్ పల్లి, విశాలభారతి:** శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని హైదర్ నగర్ డివిజన్లో హెచ్ఎంటి హిల్స్ లో బిఆర్ఎస్ నాయకులు వెంకటసుబ్బారాజు పుట్టినరోజు వేడుకలు పార్టీ కార్యకర్తలతో నాయకులతో కలిసి ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హైదర్ నగర్ డివిజన్లో బిఆర్ఎస్ కార్యకర్తలకు నాయకులకు కలిసిమెలిసి ఉంటూ పార్టీ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొంటారని నాయకుడు సుబ్బరాజు అని ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ డివిజన్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు, శ్యామల రాజు, సంజీవరెడ్డి, శ్రీనివాసరావు, శ్రీకాంత్, , పెద్ద భాస్కర్,వాళ హరీష్ రావు,రోజా,గోపరాజు శ్రీనివాస్,రాంబాబు రాజు,శివరావు తదితరులు పాల్గొన్నారు.




# విద్యా-వైద్య రంగాలను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

### బతుకమ్మ చీరలపై ఉన్న శ్రద్ధ లేదా

### పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్

### పేద విద్యార్థుల భవిష్యత్తు చీకటిలోక

**మహబూబాబాద్, విశాలభారతి:**

జిల్లా సిపిఐ ఎంఎల్ న్యూడెమో పార్టీ కార్యాలయంలో పిడిఎస్యు ఆధ్వర్యంలో విద్యా రంగ సమస్యలపై విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, పేద విద్యార్థుల భవిష్యత్తు చీకటిలో మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీపై ఎంత శ్రద్ధ చూపుతుందో, అంత శ్రద్ధ విద్యా-వైద్య రంగాలపై చూపడం లేదు అని అన్నారు. రియంబర్స్మెంట్ ఫీజులు, స్కాలర్షిప్‌లు నెలల తరబడి విడుదల చేయక విద్యార్థులను కష్టాల్లోకి నెట్టేస్తున్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు చదువు ఒకే ఆయుధం. కానీ ఈరోజు పరిస్థితులు చూస్తే చదువు కంటే అప్పులు, నిరాశలు ఎక్కువయ్యాయి" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు నవీన్, విక్రమ్, పవన్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్.ఐకి వినతి పత్రం అందజేసిన యువ రైతులు

### యూరియా పంపిణీలో అవకతవకలు

### యూరియాను రూ.300 వసూలు

### ఒకరికి ఐదు బస్తాలు

### యువ రైతులు పర్శబోయిన మహేష్, కొప్పెర రామన్న



**మహబూబాబాద్ విశాలభారతి:**

సిరోలు మండలంలో యూరియా పంపిణీ అవకతవకలపై సిరోలు మండల తహశీల్దార్ కార్యాలయంలో యువ రైతు లు పర్శబోయిన మహేష్, కొప్పెర రామన్న లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ సుమ తికి వినతి పత్రం అందజేశారు.సిరోలు మండలంలోని కాంపెల్లి సొసైటీలలో రైతులకు యూరియా పంపిణిలో అధికా రులు ఇష్టారాజ్యంగా నిబంధ నలకు విరుద్ధంగా అవకతవ కలకు పాల్పడ్డారని సమగ్ర విచారణ జరపాలని తహశీల్దా ర్ కు వివరించారు.స్పందించి న సిరోలు తహశీల్దార్ సమగ్ర విచారణ జరుపుతానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా యువరైతులు మాట్లాడుతూ. ప్రభుత్వం సబ్సిడీ ధరకు అందించాల్సిన యూరియా బస్తాలు కొంత మంది అధికారుల నిర్లక్ష్యం,అవినీతి కారణంగా అర్హులైన రైతులకు చేరడం లేదని తీవ్ర ఆరోపణ లు చేశారు.భూమి పరిమాణం, సాగు పంటల ఆధారంగా సరైన కేటాయింపులు జరగక పోవడంతో కొంత మంది రైతులకు ఒక్క బస్తా కూడా దొరకకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. "సబ్సిడీ పేరుతో ప్రభుత్వం ఇచ్చే సాయం రైతులకు చేరక పోవడం దురదృష్టకరమని, కాంపెల్లి సొసైటీలో ఒకే వ్యక్తికి ఐదు బస్తాల వరకు ఇవ్వడం, ఇంకొంతమందిని పూర్తిగా విస్మరించడం జరిగింది.ధర విషయంలో కూడా రైతులను మోసం చేశారు.రూ.266కే ఇవ్వాల్సిన యూరియాను "చిల్లర" లేదు అంటూ రూ. 300 వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు."రైతు బతుకుతో ఇలా ఆటలాడటం అసహనం కలిగిస్తోంది.చిల్లర లేదంటూ రూ.34 అదనంగా వసూలు చేయడం స్పష్టమైన దోపిడీ.ఈ అన్యాయం పై వెంటనే విచారణ జరిపి, అదనంగా వసూలు చేసిన డబ్బును రైతులకు తిరిగి చెల్లించాలి"అని హెచ్చరించా రు.రైతు కోసం ప్రభుత్వం ఇస్తున్న ప్రతి రూపాయి రైతు చేతికి చేరాలి.అధికారులు, సొసైటీ సభ్యులు కలిసి ఇలా రైతులను మోసం చేయడం సరికాదన్నారు.రైతుల పంట వివరాలు మండల వ్యవసా య అధికారుల దగ్గర లేవా ఇష్టం వచ్చినట్లుగా ఆన్లైన్ రావడం లేదనే షాక్ లతో రైతుల(తంబు)వేలిముద్ర, భూమి పత్రాలు లేకుండా టోకె న్లతో ఇష్టారాజ్యంగా యూరి యా పంపిణి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.



# బతుకమ్మ ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు

**తొర్రూరు, విశాలభారతి:**

బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానిక మున్సిపల్ కమిషనర్ వక్కల శ్యాంసుందర్ అన్నారు.ఈనెల 21న (ఆదివారం) బతుకమ్మ పండుగ సందర్భంగా శుక్రవారం డివిజన్ కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు.బతుకమ్మ ఆడే చెరువు పరిసరాలతో పాటు నిమజ్జన ప్రాంతాలవద్ద లైటింగ్,పారిశుధ్య పనులు, తాగునీటి వసతి ,మైదానాలను చదును చేయడం వంటి పనులు కమిషనర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తరతరాల తెలంగాణ జనజీవన సంస్కృతికి ప్రతిబింబం బతుకమ్మ పండగని,తెలంగాణ ఆత్మగౌరవ ఉద్యమ చిహ్నం బతుకమ్మ అని తెలిపారు. మహిళలు అత్యంత ఉత్సాహంతో ఆటపాటలతో జరుపుకునే పండుగ బతుకమ్మ తొర్రూరు పట్టణంలో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ రంజిత్, శానిటరీ ఇన్స్పెక్టర్ కొమ్ము దేవేందర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమరాజ శేఖర్,వార్డు ఆఫీసర్ జలగం మీనేష్, స్థానికులు బెల్లంకొండ దేవేందర్, జె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్



**తొర్రూర్, విశాలభారతి:**

ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా బీజేపీ చేపట్టిన సేవా పక్షోత్సవాల లో భాగంగా తొర్రూరు పట్టణంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా బీజేపీ సేవా పక్షం పేరు మీద పక్షం రోజుల పాటు అనేక సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని,దీనిలో భాగంగానే రక్త దానం శిబిరాన్ని విజయవంతంగా పూర్తి చేసి ఈరోజు స్వచ్ఛ భారత్ చేపట్టడం జరిగింది అని తెలిపారు.నరేంద్ర మోడీ మొదటి సారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే స్వచ్ఛ భారత్ పథకాన్ని ప్రారంభించారని,ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా ధేశ వ్యాప్తంగా 12 కోట్ల మరుగుదొడ్లు నిర్మించి మహిళల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టడం తో పాటు స్వచ్ఛ భారత్ క్రింద చేపట్టిన పారిశుద్య చర్యల కారణంగా ధేశంలో అంటురోగాలు, విషజ్వరాలు వంటి అనేక సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ప్రజలకు రక్షణ కవచం లా ఉపయోగపడుతుంది అని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కొలుపుల శంకర్,అలిసేరి రవిబాబు,గడల శేఖర్,ఆర్ .రాజ్ కు మార్,మండల ప్రధాన కార్యదర్శి నడిగడ్డ సందీప్,గంధం రాజు,జలగం రవి తదితరులు పాల్గొన్నారు.



## దేవస్థాన నిర్మాణ సమావేశం

**చౌటుప్పల్, విశాలభారతి:**

పట్టణ కేంద్రంలోని 10వ వార్డులో ఆనాదిగా పూజలు అందుకుంటున్న ఇంద్రపాల ముత్యాలమ్మ తల్లికి నూతనంగా దేవస్థాన నిర్మాణానికి సంబంధించి పలు కుల సంఘాలు దేవస్థానం ఆవరణలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ముందుగా అమ్మవారికి కుమ్మరులు దీపారాధన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పలు కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ,100 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈశాన్య ఇంద్రపాల ముత్యాలమ్మ తల్లికి ప్రతి సంవత్సరం ఘనంగా అన్ని కులాల వారు పెద్ద సంఖ్యలో భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించడం జరుగుతుందని అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ దినదినాభివృద్ధి చెందుతున్న సందర్భంగా గ్రామ దేవతలను కొలుచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.దీనిలో భాగంగా గుడి నిర్మాణం కు త్వరలో కమిటీని ఏర్పాటు చేసుకొని గుడి నిర్మాణానికి పూనుకుంటామని తెలిపారు.విజయదశమి సందర్భంగా దేవస్థానం ఆవరణలో సెప్టెంబర్ 22వ తేదీన శ్రీ దుర్గా మాత విగ్రహ ప్రతిష్ట నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. దీనికిగాను త్వరలో ఉత్సాహ కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో పలు కుల సంఘాల పెద్దలు చింతకింది అంజయ్య గౌడ్, ముత్యాల భూపాల్ రెడ్డి,ఎరుకల భీమయ్య గౌడ్,ఎర్రసాని సతీష్ యాదవ్,ఎరుకల నరేష్ గౌడ్,చింతకింది శేఖర్ గౌడ్,ఉడుగు మల్లేష్ గౌడ్,పల్చం ఉత్తరయ్య ముదిరాజ్,పాశం రామాంజనేయులు ముదిరాజ్, పాలకుర్ల స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపిన ప్రెస్ క్లబ్ సభ్యులు

**డోర్నకల్, విశాలభారతి:**

మర్పడ మండలం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సతీష్ కుమార్ కు మరిపెడ ప్రెస్ క్లబ్ సభ్యుల తరఫున శుభాకాంక్షలు తెలిపారు. మరిపెడ మండలం స్థానిక పోలీస్ స్టేషన్ నందు ఎస్ఐ సతీష్ కుమార్ గౌడ్ కు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మూడు శ్రీ కుమార్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రెస్ క్లబ్ సభ్యులు ఐజేయు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గంధసిరి రవి, అశోక్ కుమార్, బోడ శ్రీను, బానోతు ప్రవీణ్ నాయక్, ఉప్పల రమేష్ ,బాషిపంగు వెంకన్న, సోమన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.జి.ఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలు ప్రారంభం



**వలిగొండ, విశాలభారతి:**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ హై స్కూల్ లో 69వ ఎస్.జి.ఎఫ్. జిల్లా స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరై క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలకు శుభారంభం చేశారు. ఈ పోటీలలో జిల్లా వ్యాప్తంగా 17 మండలాల నుండి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కబడ్డీ పోటీల్లో పాల్గొన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల యూనివర్సిటీని ప్రారంభించి విద్య, క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. త్వరలో రెసిడెన్షియల్ పాఠశాలలను స్వయంగా సందర్శించి అవసరాలు తెలుసుకొని అభివృద్ధి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. వారి వెంట జిల్లా యువజన నాయకుడు కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బత్తిని వరుణ్ గౌడ్ ఉన్నారు. 69వ ఎస్.జి.ఎఫ్. జిల్లా స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలను మాజీ ఎంపీటీసీ పసల సంపత్ జ్ఞాపకార్థం పి.ఆర్.టి.యు మండల అధ్యక్షులు అసలు జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు.



## వేద పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు శు క్రవారం రోజు ఉదయం కుంట్లూరు గ్రామంలోని వేద పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగగా, వేదమంత్ర ఘోషల మధ్య ప్రత్యేక పూజలు, ఆశీర్వాదాలు జరగ్గా గ్రామస్తులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృప పొందారు.ఈ సందర్భంగా ఆయనతో పాటు పార్టీ కీలక నాయకులు హాజరయ్యారు. వారిలో ఉప్పల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పార్వతి బాల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెడ్డి అర్జున్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు సాధు శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షులు పిల్లి బాల మల్లేష్, ప్రధాన కార్యదర్శి బద్దం శ్రీకాంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మద్ది శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి గుర్రం శ్రీధర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ఓబిసి కార్యవర్గ సభ్యులు గూడెపు మధు గౌడ్, పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ బిజెపి యువ నాయకులు పిల్లి శ్రీనివాస్ యాదవ్,గుర్రం దామోదర్ రెడ్డి, బీజేవైఎం నాయకులు లిక్కి ప్రభాకర్ రెడ్డి, నెల్లుట్ల శ్రీధర్, సామా మహేందర్ రెడ్డి, చెవుల సాగర్, న్యాయవాది చంచు బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులతో భోజనం చేసిన ఎమ్మెల్యే కుంభం

### మోడల్ స్కూల్ ఆకస్మిక తనిఖీ

### ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**వలిగొండ, విశాలభారతి:**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని లోతుకుంట గ్రామ మోడల్ స్కూల్‌ను భోనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, రవాణా సదుపాయాల కోసం వెంటనే డిపో మేనేజర్‌తో మాట్లాడారు. అలాగే, కిచెన్ షెడ్, కంప్యూటర్ రూం విండోస్, బాలుర మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలని వచ్చిన వినతులను గమనించి త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తరువాత విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ "నాణ్యమైన ఆహారం అందించడం ప్రభుత్వ సంకల్పం, విద్యార్థుల భవిష్యత్తు కోసం అన్ని వసతులు కల్పించడానికి కృషి చేస్తాం" అన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రయిసున్నీసాబేగం, ఉపాధ్యాయులు జి.శేఖర్, బి.కృష్ణ, గౌస్, రాజేశ్వరి, జహ్రూనిస, పి.ఈ.టి ఐలయ్యతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేతులతో సీఎం రిలీఫ్ ఫండ్ సహాయం

## బాధిత కుటుంబానికి అందించిన ఎల్ఓసి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

ఎల్.బి.నగర్ నియోజకవర్గం శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సహకారంతో, మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని మధురా నగర్ కాలనీ వాస్తవ్యులు లింగయ్య కుమారుడు శివ వరుణ్ ఆరోగ్య చికిత్సా ఖర్చుల నిమిత్తం2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ ఓ సి అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజల ఆరోగ్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరప్రసాదమని, పార్టీ తరఫున ఎల్లప్పుడూ బాధిత కుటుంబాల పక్కనే నిలబడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, ఎల్.బి.నగర్ నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ యువజన నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, నర్రి వెంకన్న, సుగ్రీవ, మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లంబాడీల ఆత్మగౌరవ సభకు తరలిన నాయకులు



**తొర్రూరు, విశాలభారతి:** లంబాడీల ఆత్మగౌరవ సభకు శుక్రవారం తొర్రూరు నుండి లంబాడ నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా కో కన్వీనర్ దారావత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై లంబాడీల జోలికొస్తే ఊరుకోమన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కు మాదని అన్నారు.గోండు,కోయ నాయకులు లంబాడీలపై దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ దారావత్ జై సింగ్ నాయక్, గిరిజన సామాజిక వేత్త జాటోత్ సాయికృష్ణ, లెక్చరర్ మాలోత్ హరి కిషన్ నాయక్, గుగులోత్ వెంకట్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

## ఆర్ కోటంరాజు భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**చౌటుప్పల్, విశాలభారతి:**

భవన నిర్మాణ కార్మిక సంఘం, యాదాద్రి భువనగిరి జిల్లా 4 మహాసభలు మున్సిపాలిటీలోని గట్టు శ్రీరాములు ఫంక్షన్ హాల్ నందు నిర్వహించడం జరిగింది.కొండూరు రోడ్ లో గల భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ చేసి తదనంతరం ర్యాలీ ద్వారా ఫంక్షన్ హాల్ నందు మహాసభ నిర్వహించుకోవడం జరిగింది.ఈ మహాసభకు ముఖ్య అతిథిగా భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆర్ కోటం రాజు విచ్చేసి తదనంతరం వారు మాట్లాడుతూ సిఐటియు సహకారంతో దశాబ్దాల పోరాటాల ఫలితంగా 1996 లో భవన నిర్మాణ కార్మిక చట్టం,ఐక్యత పోరాటాల పట్టిమవలన దేశవ్యాప్తంగా



వెల్ఫేర్ బోర్డు తద్వారా సంక్షేమ పథకాలను సాధించుకోగలిగామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన లేబర్ కోడ్ ల పేరుతో తొలగించేందుకు ప్రయత్నిస్తుందని అన్నారు.లేబర్ కోడ్ రద్దుకు భవన నిర్మాణ కార్మిక సంఘం.కార్మికులను ఐక్యం చేసి నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు.కార్మికులు పని సమయాలలో మరణించిన,సహజ మరణాలతో పాటు పూర్తి అంగవైకల్యం వంటి సంక్షేమ పథకాలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం కార్మికులకు నష్టం కలిగిస్తుందని అన్నారు.నిర్మాణంలో వాడే ముడి సరుకుల ధరలు భారీగా పెరగడంతో మధ్యతరగతి ప్రజలు, చిన్నస్థాయి బిల్డర్లు నిర్మాణాలు చేపట్టడమే మానేశారు,దీంతో నిర్మాణరంగా కార్మికులు పనులు కోల్పోయి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని.భవన నిర్మాణరంగం సంక్షోభంలోకి నెట్టబడుతుందని అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దాసరి పాండు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న పెండింగ్ క్లైములను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గొరిగే స్వాములు,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి పాషా,ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు గోశిక కరుణాకర్,సిఐటియు జిల్లా నాయకులు ఆదిమూలం నందీశ్వర్,బత్తుల దాసు,భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు,కూరెళ్ళ నరసింహ,చీమకండ్ల శ్రీరాములు, గుణముని రాములు,కల్వకుంట్ల శివ ,తదితరులు పాల్గొన్నారు.



## రంగారెడ్డి జిల్లా కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బొడ్డు బిక్షపతి గౌడ్

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

రంగారెడ్డి జిల్లా కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన బొడ్డు బిక్షపతి గౌడ్ శుక్రవారం రోజు టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలువడం జరిగింది. ఈ సందర్భంగా బిక్షపతి గౌడ్ తన నియామకానికి సహకరించి ప్రోత్సాహం అందించినందుకు మధుయాష్కీకి కృతజ్ఞతలు తెలిపారు. తమపై చూపిన నమ్మకానికి అనుగుణంగా న్యాయ సేవల్లో నిబద్ధతతో పనిచేస్తానని ఆయన తెలిపారు.అలాగే బిక్షపతి గౌడ్ కి మధుయాష్కీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, తన భవిష్యత్ కార్యాచరణలో విజయాలు సాధించాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సన్మానోత్సవం




**మహబూబాబాద్ విశాలభారతి:**

మానుకోట కిరాణా వర్తక సంఘం ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఇంటర్నేషనల్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం విశేషంగా ఆకట్టుకుంది. ఇంటర్నేషనల్ లైన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ డి.రెడ్డి సారథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఐఎఫ్ఎస్ అధికారి డి.బీమా నాయక్ (సిసిఎఫ్ఓ), మహబూబాబాద్ డిఎఫ్ఓ విశాల్, జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి, పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు హాలియా నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలాజీ నాయక్ హాజరై సభను మరింత గౌరవవంతం చేశారు. ఈ సందర్భంగా ధరావత్ బాలాజీ, తేజావత్ హుస్సేన్, భుక్యా భరత్ నాయక్, విజయ్, శ్రీను, కృష్ణ, భీమా, కిషన్, రవి, బాలు, మంగు ఉపాధ్యాయులు తమ విశిష్ట విద్యా సేవలకుగాను అవార్డులతో సత్కరించబడ్డారు. వారి బోధన పద్ధతులు, విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించే తపన, పేద పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దే పట్టుదల గురించి అతిథులు ఒక్కొక్కరినీ ప్రత్యేకంగా ప్రశంసించారు. డిఎఫ్ఓ విశాల్ మాట్లాడుతూ, "ధరావత్ బాలాజీ బోధన విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచుతోంది" అని అన్నారు. విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి మాట్లాడుతూ, "తేజావత్ హుస్సేన్ పేద విద్యార్థుల కోసం తన జీతం నుంచి సాయం చేయడం విశేషం" అని కొనియాడారు. హాలియా నాయక్ మాట్లాడుతూ, "భుక్య భరత్ ఆధునిక సాంకేతికతతో విద్యార్థుల్లో విజ్ఞానపిపాస పెంచుతున్నారు" అని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలాజీ నాయక్ మాట్లాడుతూ, "విజయ్, శ్రీను, కృష్ణ లు తమ బోధనతో పాటు సామాజిక సేవలోనూ నిలుస్తున్నారు" అని పేర్కొన్నారు.



## మణికొండ అభివృద్ధికి ప్రత్యేక కృషి
### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

మణికొండ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు.శుక్రవారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రూ. 6.48 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. మణికొండ మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి ఈ పనులను చేపట్టారు. చిత్రపురి కాలనీలో కమ్యూనిటీ హాల్, స్పోర్ట్స్ పార్క్, వార్డు నం. 1, 2 లోని చిత్రపురి కాలనీలో రూ. 1.40 కోట్లతో కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు, చిత్ర %శ్రీ%పురి కాలనీలో రూ. 67 లక్షలతో స్పోర్ట్స్ పార్క్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. వివిధ వార్డుల్లో మొత్తం రూ. 1.86 కోట్లతో మూడు బిటీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. స్పోర్ట్స్ పార్క్, రోడ్ల అభివృద్ధి వార్డు నం. 8 లో రూ. 1.50 కోట్లతో వివిధ ప్రాంతాలలో రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభించారు. రూ. 43 లక్షలతో స్పోర్ట్స్ పార్క్ అభివృద్ధికి సంబంధించిన పనులను ఆయన ప్రారంభించారు. వీటితో పాటు, వార్డు నం. 9 లోని పార్క్ అభివృద్ధి (రూ. 40 లక్షలు), వార్డు నం. 7 లోని గోల్డెన్ టెంపుల్ నుండి గౌతమ్ మోడల్ స్కూల్ వరకు సెంట్రల్ మీడియన్ నిర్మాణం (రూ. 50 లక్షలు), వైఎస్సార్ కాలనీలో హై టెన్షన్ పవర్ లైన్ కింద ఖాళీగా ఉన్న స్థలాల అభివృద్ధి (రూ. 50 లక్షలు) పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, మున్సిపల్ అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



## ఆర్థిక సహాయం అందజేసిన మాజీ సర్పంచ్
### పైళ్ల సంధ్యారాణి - ఉపేందర్ రెడ్డి

**వలిగొండ, విశాలభారతి:**

యాదాద్రి భువనగిరి జిల్లా సుంకిశాల గ్రామానికి చెందిన మోగిలిపాక నర్సింహ అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ శ్రీమతి పైళ్ల సంధ్యారాణి–ఉపేందర్ రెడ్డి గారు నర్సింహ గారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు కుటుంబ సభ్యులకు ?5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా పైళ్ల సంధ్యారాణి మాట్లాడుతూ.. నర్సింహ గారి మరణం చాలా బాధాకరం. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. దేవుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తున్నాను" అని అన్నారు. ఈ కార్యక్రమంలో మంగ బాలయ్య, కొండే కిష్టయ్య, మంగ జగన్, కుమార్, మంగ పాండు, ఈర్లపల్లి నర్సింహ, ఇంజమూరి రమేష్, పోలేపల్లి ఉప్పలయ్య, బాలయ్య, నర్సింహ, బోధాసు సోములు, మోగిలిపాక కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం

**మహబూబాబాద్, విశాలభారతి:**

రైతులకు యూరియా అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సిపిఐ రైతు సంఘం అనుబంధ సంస్థ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నెల్లూరు నాగేశ్వరరావు, బి ఆర్ ఎస్ గ్రామ అధ్యక్షులు నామా సైదులు, సిపిఎం మండల నాయకులు పిట్టల వెంకన్న కన్నా లు అన్నారు. శుక్రవారం కొరివి మండలం బలపాల గ్రామంలో రైతులకు యూరియా ఇవ్వాలని గ్రామపంచాయతీ సెంటర్లో సిపిఐ సిపిఎం విఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులను సమీకరించి ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ రైతు సంఘం అనుబంధ సంస్థ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నెల్లూరు నాగేశ్వరరావు బి ఆర్ ఎస్ గ్రామ అధ్యక్షులు నామా సైదులు సిపిఎం మండల నాయకులు పిట్టల వెంకన్న కన్నాలు మాట్లాడుతూ కేంద్రం నుండి యూరియా తెప్పించడంలో బిజెపి కేంద్ర మంత్రులు పూర్తిగా విఫలం చెందాలని, వరి పంట పొట్టకు వస్తున్న సమయంలో యూరియా కొరత ఏర్పడడంతో పంట దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా



నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇబ్బంది లేకుండా యూరియాని అందించాలని తెలంగాణ రాష్ట్రంలో 8 మంది బిజెపి ఎంపీలు ఉండి కూడా రైతు కష్టాలను తీర్చడంలో పూర్తిగా విఫలం చెందారని, ఇప్పటికైనా రైతులు ఇబ్బంది పడకుండా తక్షణమే యూరియాని అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము కూడా కేంద్రం మీద ఒత్తిడి తీసుకొచ్చి యూరియాను తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకోవాలని లేని పక్షంలో రెండు మూడు రోజులలో రైతులను సమీకరించి రైతులతో భారీ ధర్నా నిర్వహించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ కార్యదర్శి రామ, గాని రవి, రేపాకుల పాపయ్య, మాజీ ఎంపీటీసీ బత్తుల వెంకన్న, సిపిఎం నాయకులు పున్న వెంకన్న, కేసరి లాలయ్య, రంగారావు రైతులు తదితరులు పాల్గొన్నారు.



## వీరభద్రేశ్వర స్వామి వారిని దర్శనంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్
### గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ,పాలకమండలి సభ్యులు

**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**

పరమశివుని ఉగ్రరూపమైన శ్రీ కొరవి వీరభద్రేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం చైర్మన్ మధుసూదన్ రెడ్డి దేవాలయ అభివృద్ధి, సేవా కార్యక్రమాలకు తాము ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామ ప్రజలు, భక్తులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరచారితో పాటు పాలకమండ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## అధిక దిగుబడినిచ్చే రాశి స్విఫ్ట్ పత్తి విత్తనం మెగా ఫీల్డ్ డే
### రీజనల్ మేనేజర్ ప్రదీప్ కుమార్

**మునుగోడు, విశాలభారతి:**

నల్గొండ జిల్లా చింతపల్లి మండలం గొల్లపల్లి గ్రామంలో రైతు సేవ్యా నాయక్ పత్తి చేనులో రాశి సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ వారు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ బిజినెస్ మేనేజర్ ప్రదీప్ కుమార్,టెర్రిటరీ సేల్స్ మేనేజర్ రోహిత్ లు మాట్లాడుతూ రాసి స్విఫ్ట్ అనే హైబ్రిడ్ పత్తి తొందరగా కాపుకు వచ్చే రకమని,ప్రతికూల వాతావరణం లో రసం పీల్చె పురుగులను సమర్థవంతంగా తట్టుకొని ఎక్కువ కాయలను నిలుపుకునే సామర్థ్యం కలిగి,రైతులకు అత్యధిక దిగుబడిని ఇచ్చే రకమని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి 400 మంది పత్తి రైతులు,డీలర్లు, కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు పూల యాదయ్య, శ్రీకాంత్, వెంకటయ్య,కంపెనీ సిబ్బంధి రమేష్ ,భూపాల్ ,శ్యామ్ ,రాజు,మనోహర్ లు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రేబిస్ నివారణకు సహకరించాలి
### కమిషనర్ శరత్ చంద్ర

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

రేబీస్ వ్యాధి నివారణకు అందరూ సహకరించాలని కమిషనర్ శరత్ చంద్ర అన్నారు. కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు శుక్రవారం బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ లో స్వచ్ఛతా హి సేవలో భాగంగా రాబిస్ ఫ్రీ తెలంగాణగా తీర్చిదిద్దుటకు మున్సిపాలిటీలోని కుక్కలకు రాబిస్ వ్యాక్సినేషన్, వివిధ వ్యాధుల నివారణకు గాను టీకాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లూ క్రాస్ సంస్థ డాక్టర్స్, మున్సిపల్



కమిషనర్ బి శరత్ చంద్ర, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, మేనేజర్ పర్వతాలు, శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరెడ్డి, కార్యాలయ సిబ్బంది వివిధ కాలనీల కుక్కల యజమానులు పాల్గొన్నారు.

## పులి దాడిలో ముగ్గురు మృతి

**హైదరాబాద్:** తెలంగాణ సరిహద్దుల్లో పులుల దాడులు దడ పుట్టిస్తున్నాయి. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో జరిగిన ఈ పులుల దాడుల్లో ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఒకే రోజు వేర్వేరు చోట్ల ముగ్గురిపై దాడి చేశాయి. మృతుల్లో ఓ మహిళ, ఓ పురుషుడు, ఓ బాలుడు ఉన్నాడు.